క్లుప్తంగా

చురుగ్గా పింఛన్ల పంపిణీ


వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

అక్కిరెడ్డిపాలెం: నియోజకవర్గంలో లబ్ధిదారులకు శనివారం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చురుగ్గా సాగింది. 68వ వార్డులో వేకువ జామునే వలంటీర్లు కన్వీనర్లతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెంలో కప్పారమణమ్మ (80)కు వలంటీర్ టొంపా సత్య, కన్వీనర్ నేలపాటి సత్యవతి వృద్ధాప్య పెన్షన్‌ను అందించారు.

డాక్టర్ బుచ్చిరాజుకు సన్మానం


ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజును సన్మానిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: డాక్టర్స్ డేను అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెంలోని వాసవీ క్లబ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ రీజనల్ చైర్మన్ సీహెచ్.బంగారు రాజు, జెడ్సీ కటకం శైలజ, జిల్లా అధికారులు సింగంశెట్టి సతీష్ కుమార్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వి.కుమార్ గుప్తా, కార్యదర్శి ఎన్.గాంధీ గుప్తా, కోశాధికారి ఎ.ఎల్.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

'సర్వహిత' వితరణ

అగనంపూడి: పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఐదుగురు నిరుపేద మహిళలకు చీరలు, నిత్యావసర సరకులు పంపిణీ చేసింది. అగనంపూడి వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు ఆర్థిక సహాయంతో పెదమడకలోని సంపత్ వినాయక ఆలయంలో వీటిని అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉన్నత చదువుకు ఆర్థిక సహకారం

కూర్మన్నపాలెం: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులతో పాసైన పేద కుటుంబానికి చెందిన కె.రమ్య ఉన్నత చదువులకు స్పందన ఫౌండేషన్ ఆర్థిక సహకారం అందించింది. 87వ వార్డు కణితి నిర్వాసిత కాలనీకి చెందిన రమ్య టెన్త్ క్లాస్‌లో 570 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా ఆమెకు స్పందన ఫౌండేషన్ సభ్యుడు బుచ్చిరాజు రూ.10వేల నగదును కార్పొరేటర్ బొండా జగన్ చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో రాజన్‌రాజు, శ్రీనివాస్‌రాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీలకు మోదీ కిట్లు

గాజువాక: బీజేపీ బూత్ కమిటీలకు ఆ పార్టీ నాయకులు మోదీ కిట్లను అందజేశారు. పాతకర్ణవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బూత్ కమిటీల అధ్యక్షులకు బీజేపీ కరపత్రాలు, జెండాలు, టోపీలు, కండువాలతో కూడిన ఈ కిట్లను గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకరరావు, నాగేశ్వరరావు, ములకలపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'అస్థిపంజరం ఘటనపై విచారణ చేపట్టాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని అస్థిపంజరం సంఘటనపై విచారణ జరిపి నేరస్తులను పట్టుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. శనివారం ఉక్కునగరంలో జరిగిన ఈ సంఘటన టౌన్‌షిప్ ప్రజలనే కాకుండా యావత్ విశాఖ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. హత్య వెనుక ఉన్న రాజకీయ, భూరియల్ ఎస్టేట్ మాఫియాను నిగ్గు తేల్చి వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ లబ్ధి

- ప్రజలకు కష్టాలు ఉండకూడదనే కార్యక్రమ రూపకల్పన
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


దరఖాస్తుదారుడికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: ప్రభుత్వ సేవలు, పథకాలు పొందడంలో ప్రజలకు కష్టాలు ఉండకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అర్హులందరికీ పథకాలను అందించి న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని పేర్కొన్నారు. జీవీఎంసీ 66, 73వ వార్డుల పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ప్రభుత్వ సేవలను పూర్తిగా ఉచితంగా అందించడంతో పాటు పథకాలు అందని అర్హులకు న్యాయం చేసే విధంగా సురక్ష క్యాంపుల ద్వారా చర్యలు తీసుకుంటారన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలు, పట్టాదారు పాసు పుస్తకాలు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, భూముల రికార్డులలో పట్టాదారుని మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో అనుసంధానం చేయడం, క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు సర్టిఫికెట్ వంటి సేవలను ఉచితంగా పొందవచ్చన్నారు.

క్యాంపుల ద్వారా సత్వర పరిష్కారం

వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుంటారని, సురక్ష క్యాంపుల ద్వారా సత్వరం పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి పౌరుడి ముఖంలో చిరునవ్వు చూడాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని అన్నారు. గతంలో చంద్రబాబు అనేక హామీలను ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని, మళ్లీ ఇప్పుడు కల్లబొల్లి మాటలతో ఓట్లు అడిగేందుకు తయారయ్యారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు హామీ ఇవ్వని అనేక పథకాలను కూడా అమలు చేశారని పేర్కొన్నారు. ప్రజలు సంతోషంగా ఉండటం కోసం నిరంతరం శ్రమిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రజలు దీవించాలని కోరారు. అనంతరం పలువురికి సురక్ష పథకం ద్వారా మంజూరైన ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, సచివాలయాల కన్వీనర్లు ఎస్.ఎం.డి.గౌస్, రాజాన వెంకటరావు, నాయకులు రెడ్డి జగన్నాథం, పెదిరెడ్ల ఈశ్వరరావు, పేరం రామకృష్ణారెడ్డి, ఎస్.కె.ఆశ, ఉరుకూటి అప్పారావు, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐదు నిమిషాల్లో సర్టిఫికెట్ ఇచ్చారు



నేను కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌ను ఐదు నిమిషాల్లో పొందగలిగాను. బీసీ సర్టిఫికెట్ కోసం గతంలో చాలాసార్లు దరఖాస్తు చేసినా రాలేదు. ఇప్పుడు జగనన్న సురక్ష కార్యక్రమం సందర్భంగా దరఖాస్తు చేశాను. వెంటనే నాకు సర్టిఫికెట్ వచ్చింది. అదీ రుసుం ఏమీ లేకుండా ఇచ్చారు. – మహ్మద్ కుద్దుస్, అజీమాబాద్

సీఎంకు ధన్యవాదాలు



నేను రెండు రోజుల క్రితం సర్టిఫికెట్ కావాలని వలంటీర్‌కు చెప్పాను. నా నుంచి దరఖాస్తు తీసుకొని ఈ రోజు జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్ ఇచ్చారు. ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు. – నేమాల మంగవేణి, గాజువాక

ఇది పేదల ప్రభుత్వం


నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 74వ వార్డు సిద్ధేశ్వరం రామాలయం వీధిలో శనివారం ఆయన పర్యటించారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డితో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. గడచిన నాలుగేళ్లలో 95 శాతం పథకాలను అమలు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, గొరుసు సత్యం, గొందేశి సత్తిరెడ్డి, గంగులూరి రోజారాణి, నందికి తాతారావు, గొరుసు రామలక్ష్మి, ఉమ, ఒమ్మి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాకు చెక్




పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: తాగునీటి వృథాకు అధికారులు చెక్ పెట్టారు. ప్రధాన రహదారిలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట, ఫైర్‌స్టేషన్ సమీపంలో తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో తాగునీరు వృథాగా పోయింది. దీంతో పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఈ నెల 1వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'పగిలిన పైపులైన్.. తాగునీరు వృథా' శీర్షికన ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఏఈ కేదార్‌నాథ్ స్పందించారు. వెంటనే అక్కడ పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఏఈ ఆదేశాల మేరకు సిబ్బంది శనివారం మరమ్మతులు చేపట్టారు. నీటి వృథాను అరికట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రద్దీగా దువ్వాడ రైల్వేస్టేషన్

- దువ్వాడ మీదుగా రైళ్ల మళ్లింపుతో పెరిగిన రద్దీ
- కూర్చునేందుకు బెంచీలు లేక వందలాది మంది నిల్చునే నిరీక్షణ


దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై ప్రయాణికుల రద్దీ

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. శనివారం ఉదయం నుంచి విజయవాడ వైపు వెళ్లే రైళ్ల కోసం ప్రయాణికులు క్యూ కట్టారు. ప్రయాణికులు కూర్చునేందుకు కూడా బెంచీలు లేకపోవడంతో వందలాది మంది రైలు వచ్చే వరకు నిల్చుని వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. పలు రైళ్లను విశాఖ స్టేషన్‌కు వెళ్లకుండా దువ్వాడ మీదుగా మళ్లిస్తుండడంతో రద్దీ పెరుగుతోంది. విశాఖకు సంబంధించి దువ్వాడలో మాత్రమే హాల్ట్ ఇస్తుండడం, మళ్లీ రాజమండ్రిలోనే ఈ రైళ్లకు హాల్ట్ ఉండడం కూడా ఒక కారణంగా ప్రయాణికులు చెబుతున్నారు. అయితే ప్రయాణికుల రద్దీకి తగిన విధంగా ఇంకా సౌకర్యాలు సమకూర్చాలని కోరుతున్నారు.

ఆలయాల్లో శని త్రయోదశి పూజలు


శనీశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో శనిత్రయోదశి పూజలు చేశారు. గ్రామంలోని శివాలయం ఎదురుగా గల శనీశ్వరాలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. రామాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి.

ఘనంగా విజయ సాయిరెడ్డి జన్మదిన వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయి రెడ్డి జన్మదిన వేడుకలను బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి విజయసాయిరెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

పెదగంట్యాడ: ఎంపీ విజయసాయిరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా 65వ వార్డు వాంబే కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, కుమారి దంపతుల ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు.

నాడు శుష్క వాగ్దానాలు.. నేడు హామీల అమలు

- పాలనలో తేడా పరిశీలించండి
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్


మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీల్లో ఒకటో, రెండో తప్ప అమలు చేసిన పథకాలే కనిపించవు.. అదే ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నాలుగేళ్లలో అమలు చేసి చూపించారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పాలనలో మార్పు గమనించాలని ప్రజలను కోరారు. 85వ వార్డు మంత్రిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి లబ్ధి చేకూరిన పథకాలు వివరించారు. అపరిష్కృత సమస్యల వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా చాలా వరకు సమస్యలు పరిష్కరించామన్నారు. ఇంకా ఎక్కడైనా సమస్యలు ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సంపూర్ణంగా పరిష్కరించి, సమస్యలు లేని కుటుంబాలు, సమస్యలు లేని గ్రామాలను చూడాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న ఆశయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను శ్రేయో రాజ్యంగా, ప్రగతి పథంలో పయనించే రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, కింతాద ఈశ్వరరావు, నాయకులు పచ్చికోరు రమణమూర్తి, సేనాపతి గంగరాజు, గొన్న హేమచంద్ర, ప్రసాద్, కిషోర్, కాతా నూకేష్, అప్పలరాజు, కనకరాజు పాల్గొన్నారు.

'బొర్రమాంబ పారాయణ' సభ్యులకు చీరల అందజేత


పారాయణ సమితి ప్రతినిధులకు చీరలు పంపిణీ చేస్తున్న దేవన్‌రెడ్డి, వరలక్ష్మి

అగనంపూడి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో విష్ణు సహస్ర పారాయణం, లలిత పారాయణం చేస్తున్న అగనంపూడికి చెందిన బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులకు సద్భావనా సేవా సంఘం ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానంద శర్మ ఆర్థిక సహకారంతో చీరలు పంపిణీ చేశారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో సేవా సమితిలోని 48 మంది సభ్యులకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి చేతుల మీదుగా వాటిని అందించారు. నాయకులు ఇల్లపు ప్రసాద్, చిత్తా రామారావు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితాలు

- ఈఆర్‌వో లక్ష్మారెడ్డి
- బీఎల్‌వోలకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న బీఎల్‌వోలు


మాట్లాడుతున్న ఈఆర్‌వో లక్ష్మారెడ్డి

గాజువాక: ఓటర్ల జాబితాలను పక్కాగా రూపొందించడంలో బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌వో)లు పారదర్శకంగా పని చేయాలని గాజువాక ఎన్నికల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి ఆదేశించారు. గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అనర్హుల ఓటర్లను ధ్రువీకరించడంతో పాటు పది మంది ఓటర్ల కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న డోర్ నంబర్లను గుర్తించాలన్నారు. వందేళ్ల వయసు పైబడినవారిని, వారి గృహాలను కూడా ధ్రువీకరించాలన్నారు. ఇప్పటికే తొలగించిన ఓటర్లకు నోటీసులను జారీ చేయాలని, మృతి చెందినవారు, డూప్లికేట్ ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లను నమోదు చేయాలని, ఇంకా మిగిలి ఉన్న ఎపిక్ కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఈపీ నిష్పత్తి, లింగ నిష్పత్తి, పర్యవేక్షణ, దావాలు, అభ్యంతరాల ధ్రువీకరణ ప్రక్రియ, బీఎల్‌వోల రిజిస్టర్ల తయారీ, పోలింగ్ ప్రాంతం, విభాగాల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్నికల నమోదు సహాయ అధికారులు పి.సింహాచలం, పాల్ కిరణ్, పి.రమాదేవి, మహాపాత్రో, కె.త్రినాథరావు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరుల త్యాగం వృథా కానివ్వం


దీక్షలో ప్రసంగిస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. నాటి వీరుల త్యాగ ఫలితాన్ని వృథా కానివ్వబోమని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న దీక్షల్లో 870వ రోజు శనివారం సంస్థలోని ఈఎస్ అండ్ ఎఫ్, ఈఎండీ, ఈఆర్‌ఎస్, సేఫ్టీ, టెక్‌సెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో తదితర విభాగాల కార్మికుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ఉక్కు పోరాటాన్ని కొనసాగిస్తున్నామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వ్యర్థాలకు నిప్పు.. పొగతో ఉక్కిరిబిక్కిరి


తుప్పలకు అంటుకున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: తుప్పలకు పెట్టిన నిప్పుతో భారీ మంటలు ఎగసిపడి, పొగ అలముకోవడంతో పరిసర ప్రాంతాల వారు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను అదుపు చేశారు. వివరాలివి.. 68వ వార్డు రాంనగర్‌లోని బీఎస్ఎన్ఎల్ పక్కనున్న శిథిల క్వార్టర్ల పరిసరాలను పొక్లెయిన్ల సాయంతో శుభ్రం చేసిన సిబ్బంది తొలగించిన తుప్పలను కుప్పగా పెట్టారు. వాటికి నిప్పు పెట్టడంతో మంటలు ఎగసిపడి, దట్టంగా పొగలు వ్యాపించాయి. చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ వాసులకు ఊపిరి సలపక ఇబ్బంది పడ్డారు. వారు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సంఘటనలో ఎవరికీ ప్రమాదం గానీ, ఆస్తినష్టం గానీ జరగలేదని లీడింగ్ ఫైర్ ఆఫీసర్ ఆర్.సత్తిబాబు తెలిపారు. ఏడీఎఫ్‌వో కె.గోపీ కృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది టి.సత్యనారాయణ, ఎ.కృష్ణారావు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థుల హెచ్‌సీఎల్ సందర్శన


హెచ్‌సీఎల్‌ను సందర్శించిన విజ్ఞాన్ బృందం

అగనంపూడి: హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)ను దువ్వాడ విజ్ఞాన్ ఎంబీఏ కళాశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. అక్కడి జలాంతర్గాములు, నౌకలను పరిశీలించారు. దువ్వాడ విద్యాసంస్థల రెక్టార్ వి.మధుసూదనరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు హెచ్‌సీఎల్‌ను సందర్శించి ఆవరణలో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన జలంతర్గాములు, వాటి పనితీరు, డిఫెన్స్‌లో వాటి ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, ఎంబీఏ విభాగాధిపతి మురళీకృష్ణ, కో-ఆర్డినేటర్లు శివప్రసాద్, దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' పై అవగాహన


వివేకానంద కాలనీలో జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న కన్వీనర్లు, గృహసారథులు

అక్కిరెడ్డిపాలెం: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్, కన్వీనర్ బోనెల జోసెఫ్ అన్నారు. జగనన్న సురక్షపై 68వ వార్డు వివేకానంద కాలనీలో శనివారం ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. 11 రకాల సర్టిఫికెట్లను ఎటువంటి రుసుం లేకుండా ఇంటి వద్దనే పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లు కె.శ్రీదేవి, ఎ.ఇందు, గృహసారథులు శ్రీనివాసరెడ్డి, రమణ, రాము, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు

- బస్సు యాత్రలో తప్పుడు ప్రచారాలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి చూసి ఓర్వలేకే ప్రతిపక్ష టీడీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలను అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, వైద్య రంగాలతో పాటు అన్ని రంగాలపై దృష్టి పెట్టారన్నారు. పాఠశాలలు, వైద్యశాలలు, రహదారులు, శ్మశాన వాటికలను అభివృద్ధి చేశారన్నారు.

నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారం

నియోజకవర్గంలో ప్రధాన సమస్యలెన్నో పరిష్కరించామని ఎమ్మెల్యే చెప్పారు. గాజువాక ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించామని తెలిపారు. దీని కోసం జీవో నంబర్ 71ని తీసుకువచ్చామని చెప్పారు. ఏపీఐఐసీ నిర్వాసితులకు న్యాయం చేశామని తెలిపారు. ఫార్మా నిర్వాసితులకు వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశామని, పాత అగనంపూడి నిర్వాసితులకు కూడా పట్టాలు అందజేశామని తెలియజేశారు. ఇవన్నీ అభివృద్ధి కాదా అని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేస్తున్నామని, ఈ విషయంలో ఎక్కడా అవినీతి, అక్రమాలకు తావీయడం లేదన్నారు. ఇప్పటికైనా బస్సు యాత్ర పేరుతో తప్పుడు ప్రచారాలు మానుకోవాలని సూచించారు. లేనిపక్షంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, నాయకులు కోమటి శ్రీనివాసరావు, మహాలక్ష్మినాయుడు, గొందేశి వెంకటరమణారెడ్డి, బొడ్డ గోవింద్, రోజారాణి, పూర్ణానంద శర్మ, యువశ్రీ, మంత్రి మంజుల, కల్పన గొందేశి మహేశ్వరరెడ్డి, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐపీఎంకు స్టీల్‌ప్లాంట్ పూర్తి సహకారం


స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేను సత్కరిస్తున్న ఎన్ఐపీఎం ప్రతినిధులు

ఉక్కునగరం: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం)కు స్టీల్‌ప్లాంట్ నుంచి పూర్తి సహకారం అందిస్తామని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి.పాండే తెలిపారు. శనివారం ఎన్ఐపీఎం విశాఖ చాప్టర్ కార్యవర్గ సభ్యులు ఉక్కు పరిపాలన భవనంలో నూతన డైరెక్టర్ (పర్సనల్)గా బాధ్యతలు స్వీకరించిన పాండేను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్ఐపీఎం విశాఖ చాప్టర్ ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపడుతున్న అంశాల గురించి వివరించారు. దీనిపై డైరెక్టర్ పాండే మాట్లాడుతూ పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో ఎన్ఐపీఎం చాలా కీలకంగా ఉందని, చాప్టర్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో చాప్టర్ కార్యదర్శి శేషగిరిరావు, చైర్మన్ డాక్టర్ మురళీధర్, డాక్టర్ సుధాకర్, అప్పారావు, జోగారావు, డాక్టర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.